క్లుప్తంగా

ఓటీఎస్ లబ్ధిదారులకు వరం



లబ్ధిదారురాలికి ఇంటి పట్టా అందిస్తున్న కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి

కల్లూరు: ప్రభుత్వం తీసుకువచ్చిన ఓటీఎస్ విధానం గృహ రుణాలు తీసుకున్న లబ్ధిదారులకు వరమని కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి అన్నారు. శనివారం కల్లూరు అర్బన్ 74వ వార్డు సచివాలయంలో గృహ నిర్మాణశాఖలో ఇంటి పత్రాలు తనఖా పెట్టిన లబ్ధిదారులకు కార్పొరేటర్ ఓటీఎస్ ద్వారా వాటిని పంపిణీ చేశారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ 1983 నుంచి 2011 వరకు గృహ నిర్మాణ సంస్థ వద్ద స్థలాలను తనఖా పెట్టి, ఇళ్ల నిర్మాణం కోసం రుణాలు తీసుకున్న లబ్ధిదారులు ఈ పథకం కింద నామమాత్రపు ఫీజు చెల్లించి యజమాన్య హక్కులు పొందాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

శాంతి మార్గంలో నడవాలి

కర్నూలు(రాజ్‌విహార్): సర్వ మానవాళి శాంతి మార్గంలో నడవాలని ఇస్లాం ధర్మం సూచిస్తుందని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ అన్నారు. శనివారం రాత్రి స్థానిక ఇస్లామియా అరబిక్ కళాశాల ఆవరణలో ముస్లింల ఆధ్యాత్మిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతితో పాటు ఎదుటి వారి పట్ల సమన్వయంతో ఉండాలన్నది ఇస్లాం ధర్మాల్లో ముఖ్యమైనదన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హజరత్ మౌలానా జమాల్ రహమాన్ సాహెబ్, నిర్వాహకులు షావలి, జాకీర్ పాల్గొన్నారు.

నాపరాయి లారీల పట్టివేత



తనిఖీలో పట్టుబడిన లారీ

కర్నూలు (న్యూసిటీ) : ఓర్వకల్లు, నన్నూరు టోల్ ప్లాజా, గూడూరు మండలం కె.నాగలాపురం వద్ద అక్రమంగా రవాణా చేస్తున్న నాపరాయి లారీలను పట్టుకున్నట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం అర్ధరాత్రి మైనింగ్ అధికారులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. అనుమతి లేకుండా నాపరాయి తరలిస్తున్న రెండు లారీలను ఓర్వకల్లు, నన్నూరు టోల్‌ప్లాజా వద్ద పట్టుకుని కర్నూలు తాలూకా పోలీసుస్టేషన్‌లో, కె.నాగలాపురం దగ్గర సీజ్ చేసిన మరో లారీని అక్కడి పోలీస్‌స్టేషన్‌లో ఉంచినట్లు వెల్లడించారు. వాహన యజమానులకు జరిమానా విధించనున్నట్లు వెల్లడించారు. తనిఖీల్లో విజిలెన్స్ అసిస్టెంట్ డైరెక్టర్ బైరాగి నాయుడు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్లు మురహరి, నవీన్ కుమార్, మైనింగ్ సిబ్బంది ఉన్నారు.

విద్యుత్ అదాలత్‌కు స్పందన కరువు



విద్యుత్ అదాలత్‌లో సమస్యలు వింటున్న చెర్ పర్సన్, సభ్యులు

కర్నూలు (రాజ్‌విహార్) : వినియోగదారుల సమస్యలు తెలుసుకునేందుకు నిర్వహించిన ప్రత్యేక విద్యుత్ అదాలత్‌కు స్పందన కరువైంది. శనివారం స్థానిక విద్యుత్ భవన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చైర్ పర్సన్ వి. శ్రీనివాస ఆంజనేయమూర్తి (రిటైర్డ్ జడ్జి), సభ్యులు కె.రామమోహన్ రావు, జి.ఈశ్వరమ్మ హాజరై అర్జీలు తీసుకున్నారు. అయితే, ఈ అదాలత్‌కు 9 మంది మాత్రమే హాజరయ్యారు. కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి ప్రతి వారం డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమం నిర్వహించి 95 శాతం సమస్యలకు పరిష్కారం చూపడంతో పాటు సాధారణ రోజుల్లో నేరుగా ఆయనకు ఫోన్ చేసిన వెంటనే స్పందించి, సంబంధిత అధికారులను లైన్‌లోకి తీసుకొని పరిష్కరిస్తున్నారు. దీంతో విద్యుత్ అదాలత్‌కు అధిక సంఖ్యలో అర్జీలు రాలేదు. కార్యక్రమంలో ఎస్ఏఈ చిన్న రాఘవులు పాల్గొన్నారు.

రంగస్థల కళాకారిణులకు చీరల పంపిణీ

కర్నూలు కల్చరల్: కర్నూలు జిల్లా రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దసరా పండుగ సందర్భంగా జిల్లాలోని సుప్రసిద్ధ రంగస్థల మహిళా కళాకారిణులకు చీరలు పంపిణీ చేశారు. మద్దురునగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో జరిగిన కార్యక్రమంలో టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, కర్నూలు జిల్లా రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జి.అంకయ్య, చీరల పంపిణీ ప్రదాత బైలుప్పల షఫీయుల్లా, తెలుగు భాష ఉద్యమ నాయకులు జేఎస్ఆర్‌కే శర్మ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కళారంగంలో విశిష్ట సేవలందిస్తున్న పత్తి ఓబులయ్యకు, పి.హనుమంతరావు చౌదరిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గజల్ గాయకులు మహమ్మద్ మియా, డాక్టర్ ఎస్.జి.ఎన్.సుభాన్, సయ్యద్ రోషన్ అలీ, సీబీ అజయ్‌కుమార్, పి.దస్తగిరి, మంజుల, రామకృష్ణ, టి.రాజశేఖర్, డి.పుల్లయ్య, డిఎస్‌వి సుబ్బయ్య, ఎం.మనోహర్ బాబు, డి.పుల్లయ్య, డి.పార్వతి, గాండ్ల లక్ష్మన్న, తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు బాసటగా...

- ఎమ్మిగనూరులో సీఎంను కలిసిన వారికి ఆర్థిక సాయం అందజేత
- ఒక్కొక్కరికి రూ. లక్ష చొప్పున చెక్కులు

కర్నూలు(సెంట్రల్): అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక సాయం కోసం వచ్చిన బాధితులకు సీఎం వైఎస్ జగన్ బాసటగా నిలిచారు. ఈనెల 19న ఎమ్మిగనూరుకు వచ్చిన సీఎంను హెలిప్యాడ్‌లో పలువురు బాధితులు వైద్య సహాయం, ఆర్థిక చేయాలని విన్నవించారు. వారి కష్టాలను చూసి చలించిన ఆయన తక్షణమే ఆదుకోవాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజనకు ఆదేశాలు ఇచ్చారు. అందులో భాగంగా కలెక్టర్ మొత్తం 12మందికి ఆర్థిక సాయం అందించారు. ఇందులో 11మందికి లక్ష చొప్పున ఇవ్వగా, ఒక్కరికి రూ.50 వేల చెక్కు అందజేశారు. 12మందిలో శుక్రవారం ఆరుగురికి, శనివారం మరో ఆరుగురికి కలెక్టర్ తన చాంబరులో చెక్కులను అందజేసి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో జేసీ నారపురెడ్డి మౌర్య, డీఆర్వో కె.మధుసూధనరావు పాల్గొన్నారు.





కష్టకాలంలో ఆర్థిక భరోసా



● నంద్యాల జిల్లా గడివేముల మండలం కొర్రపోలూరుకు చెందిన జీహెచ్ మద్దిలేటి 2008లో రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ప్రమాదంలో సంభవించిన ఫ్రాక్చర్ తదనంతరం బోన్‌క్యాన్సర్‌గా మారడంతో ఆరోగ్యశ్రీలో ఆపరేషన్ చేయించుకున్నారు. అయితే ఎలాంటి పనిచేయడానికి శరీరం సహకరించకపోవడంతో సీఎంను ఆర్థిక సాయం కోసం అభ్యర్థించగా కలెక్టర్ ఆయనకు రూ.50 వేల చెక్కు అందజేశారు. కష్టకాలంలో ఈ సాయం అందిందని మద్దిలేటి చెప్పారు.

విన్నవించగానే సాయం



● కర్నూలు నగరంలోని బళ్లారి చౌరస్తా సమీపంలో ఉన్న గురుబ్రహ్మ నగర్‌కు చెందిన లక్ష్మీదేవి(55) తన భర్త, పెద్ద కుమారుడు చనిపోయారని, ఉన్న చిన్న కుమారుడు ఎం. యుగంధర్ అంగవైకల్యంలో బాధపడుతున్నారని, తాను వయోభారంతో ఏ పనిచేయలేని స్థితిలో ఉన్నానని, ఆర్థిక సాయం చేయాలని సీఎం వైఎస్ జగన్‌ను అభ్యర్థించారు. వారికి కలెక్టర్ తక్షణ సాయంగా రూ. లక్ష అందజేశారు.

సీఎంకు కృతజ్ఞతలు





● తన భర్త చనిపోయారని, ఎవరూ దిక్కు లేకపోవడంతో కూలి పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నానని, తనకు విడో పెన్షన్‌ను మంజూరు చేయాలని, ఆర్థిక సాయం చేయాలని కోడుమూరుకు చెందిన భాగ్యమ్మకు సీఎంకు విన్నవించుకోగా ఆమెకు కలెక్టర్ తక్షణ సాయంగా లక్ష రూపాయలు అందజేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటానని ఈ సందర్భంగా భాగ్యమ్మ అన్నారు.

ప్రజల చెంతకే మెరుగైన వైద్యం

- జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండి
- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్



వైద్య శిబిరంలో అందిస్తున్న సేవలపై ఆరా తీస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్



బూజనూరు ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో అద్దాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్, ఎంపీడీఓ



ప్యాలకుర్తిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ

కర్నూలు కల్చరల్: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజలకు గ్రామాల్లో మెరుగైన వైద్యం అందుతుందని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. శనివారం కర్నూలు మండలం ఆర్.కొంతలపాడు గ్రామ సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపును ఎమ్మెల్యే సందర్శించి వైద్య సేవలపై ఆరా తీశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు గ్రామాల్లోని గర్భిణులకు అందిస్తున్న పౌష్టికాహారం గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసిన కంటి అద్దాలను వృద్ధులకు ఎమ్మెల్యే స్వయంగా తొడిగారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోనే అన్ని రకాల ఆరోగ్యపరీక్షలు చేసి అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేస్తున్నామన్నారు. ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమం అమలు చేస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆరోగ్యశ్రీ పథకం ప్రదాత దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మాదిరిగానే ప్రజల ఆరోగ్య పరిరక్షణకు సీఎం వైఎస్ జగన్ అత్యధిక ప్రాధాన్య ఇస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ప్రసన్నకుమార్, మాజీ మండల ఉపాధ్యక్షులు వాసు, మద్దిలేటి, వసంత్, మాజీ సర్పంచు బోయ దుబ్బన్న, ప్రకాష్, మల్లికార్జున, మధు, రంగన్న, అయ్యస్వామి, విద్యాసాగర్, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, వైద్యాధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గడివేముల: జగనన్న ఆరోగ్య సురక్ష పేద ప్రజలకు వరమని బూజునూరు సర్పంచ్ యేలంపల్లె రాములమ్మ అన్నారు. శనివారం గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాల ఆవరణలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు మొల్లా జబీన్ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు నిర్వహించారు. గ్రామస్తులకు బీపీ, షుగర్, టీబీ, మలేరియా, డెంగీ, రక్త హీనత, హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఆరోగ్య పరీక్షలతో పాటు మందులను కూడా ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. దృష్టిలోపం ఉన్నవారికి కంటి పరీక్షలు నిర్వహించి అద్దాలు ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప, పంచాయతీ కార్యదర్శి బైరెడ్డి నాగేశ్వర్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు శివరామిరెడ్డి, వైస్ ఎంపీపీ హైమావతి ,సూపర్‌వైజర్ మనోహర్, ఫార్మసిస్ట్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోడుమూరు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేదలకు ఆరోగ్య భరోసా లభిస్తుందని ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. శనివారం మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపును తహసీల్దార్ జయన్న, ఎంపీడీఓ చంద్రశేఖర్ పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలంతా తమ గ్రామంలోనే ఉచితంగా బీపీ, షుగర్, ఈసీజీ వంటి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కాగా ప్యాలకుర్తిలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపునకు విశేష స్పందన లభించింది. సుమారు 380 మందికిపైగా ప్రజలు తరలివచ్చి ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు

పాణ్యం: స్వగ్రామాల్లోనే ప్రజలకు ప్రభుత్వం మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు భూపనపాడు గ్రామ సర్పంచ్ జనార్దన్ అన్నారు. శనివారం గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కల్లూరు సొసైటీ అభివృద్ధికి మరింత కృషి

కర్నూలు(అగ్రికల్చర్): కల్లూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాన్ని మరింత అభివృద్ధిలోకి తెచ్చేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని చైర్మన్ శివశంకర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన పీఏసీఎస్‌లో జరిగిన కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు సుబ్బారెడ్డి, బాలవర్ధిరాజుతో కలిసి మాట్లాడారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి తీసుకున్న చొరవ వల్ల కాంపౌండ్ వాల్ సాకారం అయిందని తెలిపారు. ఎమ్మెల్యే, డీసీసీబీ చైర్‌పర్సన్ సహకారంతో సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఖాళీ స్థలంలో ప్రజలకు ఉపయోగపడే నిర్మాణాలు చేపట్టి సొసైటీకి ఆదాయాన్ని మరింత పెంచుతామని తెలిపారు.

8న విద్యా సంస్థల బంద్

కర్నూలు(సెంట్రల్) : కడప ఉక్కు ఫ్యాక్టరీ సాధన కోసం నవంబర్ 8వ తేదీన విద్యా సంస్థల బంద్‌ను పాటిస్తున్నట్లు వామపక్ష విద్యార్థి, యువజన సంఘాలు ప్రకటించాయి. శనివారం సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, డీవైఎఫ్,ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ తదితర సంఘాల నాయకులు హాజరై విశాఖ, కడప ఉక్కు ఫ్యాక్టరీల సాధన కోసం కార్యాచరణను ప్రకటించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎన్.లెనిన్ బాబు మాట్లాడుతూ...విభజన హామీ అయిన కడప ఉక్కు ఫ్యాక్టరీ సాధన కోసం ఉద్యమాలకు దిగుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీరాములు, ఐసా రాష్ట్రకార్యదర్శి నాగరాజు, డీవైఎఫ్ఐ నాయకులు నగేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మహేంద్ర పాల్గొన్నారు.

జెడ్పీటీసీ మృతికి ఎమ్మెల్యే నివాళి



ఆల ప్రభాకర్‌రెడ్డి భౌతికకాయంపై పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

కల్లూరు: కల్లూరు జెడ్పీటీసీ ఆల ప్రభాకర్‌రెడ్డి హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో కొన్ని రోజులుగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందారు. శనివారం ఉదయం ప్రభాకర్‌రెడ్డి మృతదేహాన్ని స్వగ్రామమైన పెద్దటేకూరుకు తీసుకువచ్చారు. ఆయన మృతి విషయాన్ని తెలుసుకున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఆయన తనయుడు కాటసాని శివనరసింహరెడ్డి గ్రామానికి చేరుకుని నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు, బంధువులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేసి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సాయంత్రం జరిగిన ప్రభాకర్‌రెడ్డి అంతిమయాత్రలో ఎమ్మెల్యే, ఆయన తనయుడితో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు, అధికారులు పాల్గొన్నారు.

అయోడిన్ లోపిస్తే ఆరోగ్య సమస్యలు

కర్నూలు(హాస్పిటల్): మనం తీసుకునే ఆహారంలో అయోడిన్ లోపిస్తే పలు ఆరోగ్య సమస్యలు, దీర్ఘకాలిక వ్యాధులు ఎదురవుతాయని డీఎంహెచ్‌వో డాక్టర్ బి. రామగిడ్డయ్య చెప్పారు. ప్రపంచ అయోడిన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద ర్యాలీని డీఎంహెచ్‌వో డాక్టర్ బి. రామగిడ్డయ్య ప్రారంభించారు. ర్యాలీ కలెక్టరేట్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా డాక్టర్ రామగిడ్డయ్య మాట్లాడుతూ అయోడిన్ ఉప్పు గర్భిణిల్లో పిండం మామూలుగా ఎదిగేందుకు సహాయపడుతుందన్నారు. చిన్నపిల్లల్లో సరైన శారీరక, మానసిక ఎదుగుదలకు అవసరమైన ఒక ముఖ్య పోషక పదార్థమని తెలిపారు.

సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయాభివృద్ధికి కృషి

- భక్తులకు సులభతర దర్శనం కోసం ప్రత్యేక క్యూ
- పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- వివిధ అభివృద్ధి పనులకు భూమి పూజ



అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

పాణ్యం: కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయాభివృద్ధికి మరింత కృషి చేయనున్నట్లు పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం ఆలయ ప్రాంగణంలో వివిధ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. దేవదాయశాఖ నిధులు రూ. 2.07 కోట్లతో క్యూలు, షెడ్లు, భక్తుల విడిదికి ప్రత్యేక గదుల నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి భక్తుడు సంతృప్తి చెందేలా, సులభంగా స్వామి దర్శనమయ్యేలా ప్రత్యేక క్యూలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అలాగే క్యూలలో నిలబడిన మహిళలు,వృద్ధులు, పిల్లలు అత్యవసర సమయంలో ఇబ్బంది పడకుండా అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు.

నాలుగు నెలల్లో పనులు పూర్తి

ఆలయ ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను నాలుగు నెలల్లో పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే కాటసాని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా క్యూలు, షెడ్ల నిర్మాణ పనుల్లో జాప్యం లేకుండా చూడాలన్నారు. అయా పనుల సమయంలో ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకూడదన్నారు. చేపట్టే ప్రతి పనిలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. అంతకు ముందు ఆయన స్వామికి అభిషేకాలు, అర్చనలు చేశారు. కార్యక్రమంలో దేవదాయశాఖ డీఈఈ శ్రీనివాసప్రసాద్, ఈఓ రామక్రిష్ణ, సర్పంచ్ బీరం రాజేశ్వరి, మాజీ ఆలయ చెర్మన్ శివరామిరెడ్డి, గుమ్మసాని క్రిష్ణారెడ్డి, ఏఈ రవికుమార్, అర్చకులు నారాయణస్వామి, సురేష్‌స్వామి, కిట్టయ్య, రామసుబ్బారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఇతాంద్రపాడు గ్రామంలో ..



కల్లూరు వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ..



వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయంలో..



సి.బెళగల్‌లో శ్రీలలితాదేవి అలంకరణలో వాసవి కన్యకా పరమేశ్వరి



గూడూరులో దుర్గాదేవిగా అమ్మవారు

దుర్గాదేవి..నమోస్తుతే!



పాణ్యంలో..దుర్గాదేవిగా



లలితాదేవి అలంకారంలో..



గడివేములలో.. పార్వతీదేవిగా

కర్నూలు కల్చరల్: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు శనివారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. కోడుమూరు, పాణ్యం నియోజకవర్గాల్లోని అమ్మవారి ఆలయాల్లో అమ్మవారిని దుర్గమ్మగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని అభిషేకాలు, హోమాలు, రథోత్సవం, పల్లకీ సేవ, లలితా సహస్రనామ పారాయణం, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. కర్నూలులోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన దుర్గా మాత విగ్రహాలకు పూజలు చేశారు. ఆధ్యాత్మిక నృత్యాలు, భక్తి సంగీత కచేరీలు, సంకీర్తనలు, కోలాటం, చెక్క భజన, హరి కథలు, నవరాత్రులపై సందేశాలు ఏర్పాటు చేశారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

సి.బెళగల్: సి.బెళగల్‌లోని పాత బస్టాండ్‌లో వెలసిన వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు ఏడోరోజు శనివారం లలితాదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. నవరాత్రోత్సవాల్లో భాగంగా భక్తులు అమ్మవారికి కుంకుమార్చన, మహామంగళ హారతి పూజలు చేశారు. అలాగే స్థానిక ఈశ్వరాలయంలో కొలువైన అమ్మవారిని లలితాదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

గూడూరు: పట్టణంలో అంబాభవానీ మాత శనివారం భక్తులకు దుర్గా దేవి అలంకరణలో దర్శనం ఇచ్చారు. ఎస్ఎస్‌కే సమాజ్ ఆధ్వర్యంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

పాణ్యం: దేవీ నవరాత్రులను పురస్కరించుకుని అమ్మవారు శనివారం దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. ఈఓ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అమ్మవారు రోజుకో రూపంలో భక్తులకు దర్శమివ్వడం జరిగిందన్నారు. ఏడోరోజు అమ్మవారిని దుర్గదేవిగా అలంకరించినట్లు చెప్పారు. అలాగే పాణ్యంలోని కాన్యక పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు శ్రీ లలితాదేవి రూపంలో భక్తులు దర్శనమిచ్చారు.

గడివేముల: గడివేముల కన్యకా పరమేశ్వరి ఆలయంలోని వాసవి మాత పార్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి కుంకుమార్చన, మహా మంగళహారతులు నిర్వహించారు.

ఉద్యోగుల సంక్షేమానికి సీఎం కృషి

- ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా శాఖ అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళ్‌రెడ్డి



మాట్లాడుతున్న వెంగళ్‌రెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): ఉద్యోగుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని, అయితే ఆర్థిక శాఖలోని కొందరు అధికారుల కారణంగా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల్లో అసంతృప్తి పెరుగుతోందని ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు వీసీహెచ్ వెంగళ్‌రెడ్డి, జవహర్‌లాల్ అన్నారు. కలెక్టరేట్‌లోని జిల్లా ట్రెజరీ కార్యాలయంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. 2022 జనవరి 1 డీఏ అరియర్స్ పెండింగ్‌లో ఉన్నాయని, ఇందుకు కొందరు ఆర్థిక శాఖ అధికారులే కారణమని పేర్కొన్నారు. స్టేట్ ఆడిట్ డైరెక్టర్ అడ్డగోలుగా బదిలీలు చేస్తుండటంతో ఆ విభాగం కింది స్థాయి ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఆయనను వెంటనే డైరెక్టర్ పోస్టు నుంచి తప్పించాలని సూచించారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వీసును క్రమబద్ధీకరిస్తూ ప్రభుత్వం గజెట్ విడుదల చేయడం శుభపరిణామమని పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో నగరశాఖ అధ్యక్షుడు ఎంసీ కాశన్న పాల్గొన్నారు.